# నటాషా

***బయటి ప్రపంచంతో ఏమాత్రం పరిచయంలేని పాప నటాషా. ఒకటో తరగతి చదువుతుంది. స్కూలుకి వెళితే తనతోపాటు తన చెల్లికూడా వచ్చి దిగాక 'టాటా' చెబితేనేగాని స్కూలు ఆవరణలోకి అడుగుపెట్టదు.***

నటాషా నాన్న, తాతయ్య, బాబాయ్ అందరూ పెద్ద వ్యాపారస్తులు. పన్నెండు వందల గజాల స్థలంలో అతి సుందరంగా కట్టిన మేడ. మేడ ముందు లాన్, పూల మొక్కలు, గేట్ ఎప్పుడూ మూసే వుంటుంది. నాలుగు కార్లు, ఎక్కడికెళ్లినా నడకతో పనేలేదు.

నటాషాని వారంవారం బయటికి తీసికెళ్ళి అలా సిటీ అంతా తిప్పుకొస్తారు. అలాగే వాళ్ళ అమ్మను కూడా. స్కూల్లో ఏమోగాని, ఇంట్లో పనిపిల్ల మినహా నటాషాకి స్నేహితులంటూ ఎవరూ లేరు. ఇంటి చుట్టుపక్కల పిల్లలున్నా ఈమె దగ్గరికి గేటుదాటి ఎవరూ వచ్చే ధైర్యం చేయరు. పులుల్లాంటి వాళ్ల రెండు కుక్కల్ని చూస్తే చచ్చేంత భయం అందరికీ.

ఇలాంటి నటాషాకి వాళ్ళ ఇంటికి కొద్దిదూరంలో ఉన్న పిల్లలిద్దరు ఎలాగో పరిచయమయ్యారు. పాప, నటాషా వయస్సే. ఇంకా ఆ పాప తమ్ముడు. ఇద్దరూ నటాషా స్కూలు నుండి వచ్చాక ట్యూషన్ మాస్టర్ రాకకు ముందు కనిపించి పోతారు. ఆదివారం కూడా వస్తారు. ఆ పాప తండ్రి ఉప్పరి పనిచేస్తాడు. తల్లి ఇళ్ళల్లో పనిమనిషి. ధనిక, పేద తారతమ్యం ఎరుగని నటాషా ఎప్పుడూ తన ఈ స్నేహితురాలు అంజనీ అని, అంజని తమ్ముడు కిట్టుగాడు అనీ తల్లితో కబుర్లు చెబుతుంది.

**భూపాల్**

అంజని, నటాషా దగ్గరికి రావడంలో ఓ స్వార్థం కూడా ఉంది. నటాషా ఇంటి రెండువైపులా ఉన్న మామిడిచెట్టు కిందరాలే కాయల కోసమో, బాదం చెట్టుకిరాలే పళ్ళ కోసమో, వెనకాల ఉన్న అల్లనేరేడుపళ్ల కోసమో మొత్తం మీద స్నేహం కుదిరింది. నటాషా మిత్రులైనందుకు ఎప్పుడూ గేటు దగ్గర నాలుగు కళ్ళు వుంచేసి చూసే రెండు కుక్కలు వీళ్ళను ఏమీ అనేవికావు. ఐనా గేటు దాటి మరీ దూరం వెళ్లకుండా ఆ పక్కనే నిలబడి కబుర్లు చెబుతుంది అంజని. అంజని తమ్ముడు కింద కనిపిస్తే కాయలు ఏరుకుంటాడు ఈలోగా.

అంజని ఎప్పుడో ఊరెళ్లినప్పుడు అక్కడ జరిగిన సంతలో వాళ్ళ తాతయ్య ఇప్పించిన చెక్కబొమ్మలు, లక్కపిడతలు, రంగురంగుల ప్లాస్టిక్ ఆటవస్తువులు అన్నీ తెచ్చి నటాషాకి చూపిందోసారి. ముచ్చట్లు చెప్పడమంటే ఎంతో ఇష్టం అంజనికి. వచ్చినప్పుడల్లా గంపెడు కబుర్లు చెపుతుంది. కిలకిలా నవ్వుతుంది. కుక్క పిల్ల, పిల్లిపిల్ల, మేక పిల్ల, లేగదూడ, కాకి, పిచ్చుక, బురదకుంట, చూరునీళ్ళు, నీటి వరద అన్నీ చిన్న కథలకు ఆధారంగా వనికొచ్చేయి అంజనికి. నటాషాకి అంజని లోకమే బాగుందని, ఇంకాఇంకా ఊరి కథలు చెప్పమంటుంది. వాళ్ల అమ్మ కేకవేస్తున్నా వినేదికాదు.



ఒకరోజు నటాషా ఏదో కోపంతో తల్లిమీద అలిగి మాటల మధ్యలో 'పాడుముండ' అంది అర్థం తెలియకున్నా. అంతే తల్లి కళ్ల నుండి నిప్పులు దూకాయి. తండ్రి ఒక్క లెంప దెబ్బ వేశాడు. ఆ తెల్లవారి నుండి అంజనీ, కిట్టుగాడు ఆ ఇంటి ఛాయలకే రాలేదు. వారం గడిచింది. రెండు-మూడు వారాలు దాటాయి. నటాషా ఎప్పుడూ ఏదో బాధతో వుంటుంది. సాయంత్రాల్లో గేటు వైపు అంజని కోసం ఆశగా చూస్తుంది. ఆమెకు తెలుసు పెద్దవాళ్లే అంజనిని తన దగ్గరకు రాకుండా చేశారని... రెండు నెలలు, మూడు నెలలు గడిచాయి. నటాషా చదువులో వెనకబడుతుంది. ఎప్పుడూ కొట్టని ట్యూషన్ మాస్టారు ఒకసారి మొట్టికాయ వేశాడు గట్టిగా... తన బాధ అంజనితో చెప్పుకుందామని ఏడ్చింది నటాషా... కానీ... ●

## వ్యంగ్యవీచికలు

రాము: మీ ఇంట్లో బల్లలు అన్నీ అలా విరిగిపోయి వున్నాయేమిటి?

గోపి: ఆc... మా నాన్న ఏ విషయాన్ని అయినా బల్లగుద్ది మరీ చెప్తాడ్రా..?

** ** **

పక్కింటి పాపాయమ్మతో మీనాక్షి...

"వదినగారూ అర్జంటుగా కాఫీపొడి కొంచెం ఇవ్వండి. చచ్చి మీ కడుపున పుడతాను.

పాపాయమ్మ: "ఆ పనిమాత్రం చేయకు తల్లీ అసలే మొగుడుపోయిన బాధలో నేనుంటే మధ్యలో ఇంకో బాధపెట్టమాకు...!!

** ** **

టైలర్: మీకు పెళ్ళి అయ్యిందా?

మోహన్: కాలేదు, ఎందుకని...?

టైలర్: ఏంలేదు.. పెళ్ళయితే మీ కొత్త డ్రస్ కుట్టేటప్పుడు సీక్రెట్ ప్యాకెట్స్ కుడదామని!!

** ** **

భర్త: ఆహా! ఈమధ్య నువ్వు పొదుపు బాగా చేస్తున్నావు. చాలా సంతోషం. నీకు 'పొదుపు మహిళ' అనే బిరుదు కూడా ఇవ్వవచ్చు!

భార్య: మరీ అంత ఆనందపడకండి. వచ్చే నెలల్లో పండక్కి బట్టలు, నగలు తీసుకోవటానికి ఇంత కష్టపడ్తున్నాను!!

భర్త: ఆc....!!

** ** **

డబ్బులు విపరీతంగా ఖర్చుచేస్తున్న కొడుకుతో తండ్రి...

"రేయ్! నేను చిన్నతనంలో చెప్పులు కుట్టుకుంటూ ఇన్నాళ్ళకు ఇంత గొప్పవాడినయ్యానురా, నీలాగా ఖర్చు చేయలేదు"

"చాలా థాంక్స్ నాన్నా, లేకపోతే నేను ఈరోజు కప్పులు కడుక్కుంటూ బతకాల్సి వచ్చేది".

– గుగ్గిలం శ్రీహరి, వేటపాలెం

